## ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

బోథ్, మార్చి 12 : సుప్రీం కోర్టు తీర్పును అమలు చేస్తూ శాస్త్రీయ బద్ధంగా ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కుడాల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్ బస్టాండ్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు మొదలైనందున వర్గీకరణకు వెంటనే చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కారం రవి, మండల కన్వీనర్ మహేశ్, బిక్క రమణయ్య, అశోక్, సదాశివ్, ఆశన్న, దివ్యాంగుల సంఘం నాయకులు మహిబూబ్, ఫాయిమ్ పాల్గొన్నారు.

## వంటపాత్రలు అందజేత

బోథ్, మార్చి 12: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌కు వచ్చిన వంటపాత్రలను మండల విద్యాశాఖాధికారి మహ్మూద్ హుస్సేన్ అందజేశారు. బుధవారం మండల విద్యావనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వీటిని అందజేశారు. తీసుకెళ్లని వారు ఎమ్మార్సీకి వచ్చి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఏఐకేఎస్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

బోథ్, మార్చి 12: ఆదిలాబాద్‌లోని గోకుల్ బ్యాంకెట్ హాల్‌లో ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న ఏఐకేఎస్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ భోజన్న పిలుపునిచ్చారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లో మహాసభలకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలకు రైతులు, కార్మికులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కుమ్రం మోతీరాం, లింగమ్మ, లక్ష్మి, అనసూయ, గంగవ్వ, రాధ పాల్గొన్నారు.

## మక్క పంట క్షేత్ర ప్రదర్శన

బోథ్, మార్చి 12: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన తూము గంగయ్య అనే రైతు సాగు చేసిన న్యూజీవీడ్ కంపెనీ వారి విన్నర్ రకం మొక్కజొన్న పంట క్షేత్ర ప్రదర్శనను బుధవారం ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు అక్కడికి వచ్చి మక్క పంటను పరిశీలించారు. మిగతా వాటితో పోలిస్తే ఈ రకం మక్క పంట అధిక దిగుబడి ఇస్తుందని సీనియర్ రీజినల్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి రైతులకు వివరించారు. కార్యక్రమంలో సెల్స్ ఆఫీసర్ మహేందర్, టీఏ రాంమోహన్, డిస్ట్రిబ్యూటర్ శ్రీకాంత్, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ పెండ్లికి ఆర్థిక సాయం

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 12: ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కోసుపటేల్‌గూడ గ్రామానికి చెందిన పేదింటి అమ్మాయి తోడసం సుశీల పెండ్లికి గ్రామంలోని 40 కుటుంబాల ఆడపడుచులందరూ కలిసి వారికి తోచినంత పొదుపు చేసుకొని రూ.20 వేలు, యూత్ సభ్యులు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేసిఐక్యమత్యాన్ని చాటుకున్నారు.

## తాగునీటి సమస్య పరిష్కరించాలి

తాంసి, మార్చి 12: ఆదిలాబాద్ జిల్లా తాంసికి వచ్చిన కలెక్టర్ రాజర్షి షాకు బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాశ్ తాగునీటి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. తాంసి చెరువు పూడిక తీయక పోవడంతో రైతులకు పంటల సాగుకు ఇబ్బందులు, మండలంలోని లింగూడలో నీటి ఎద్దడితో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని అదేవిధంగా తాంసి కేజీబీవీ కంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఎదులాపురం, మార్చి 12 : ఆదిలాబాద్ రిమ్స్‌లో వివిధ విభాగంలో స్పెషలిస్ట్ డాక్టర్ల పోస్టులను కాంట్రాక్ట్ ప్రతిపాదికన భర్తీ చేయుటకు అర్హులైన వైద్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సూపర్ స్పెషలిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ట్యూటర్స్, సీనియర్ రెసిడెంట్స్, సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, సీఎంవో పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. (ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్/ డీఎన్‌బీ & డీఎం, ఎంసీహెచ్) పూర్తి చేసి ఉండాలన్నారు. ఇతర వివరాల కోసం rimsadilabad.org , adilabad.telangana.gov.in వెబ్ సైట్‌లో పొందుపరచడం జరిగిందని తెలిపారు. అర్హులైన వైద్య అభ్యర్థులు ఈనెల 18వ తేదీన ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డైరెక్టర్ రిమ్స్ ఆదిలాబాద్ కార్యాలయం, రిమ్స్ మెడికల్ కళాశాలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

## హెచ్ఎం, వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

ఉట్నూర్, మార్చి 12: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని ప్రభుత్వ బాలిక ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థిని లాలిత్య మృతిపై ప్రభుత్వం వెంటనే స్పందించి వార్డెన్, హెచ్ఎంలను సస్పెండ్ చేయాలని డీఎస్వో జిల్లా ప్రధాన కార్యదర్శి నేతావత్ రవీందర్ అన్నారు. బుధవారం ఉట్నూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన విద్యార్థులపై అశ్రద్ధగా వ్యవహరించడం సరికాదన్నారు. విద్యార్థిని మృతిపై వెంటనే విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, రాజేశం, అరుణ్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

## ఆర్థిక లావాదేవీలపై అవగాహన

లక్ష్మణచాంద, మార్చి 12: నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీబీ రీజనల్ మేనేజర్ డీవీఎస్ రామారావు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేస్తే బ్యాంకు వివరాలు చెప్పవద్దని సూచించారు. అనంతరం రూ. 20లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంబీ విలాస్, బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్, ఎఫ్ఐ పావని, బ్యాంకు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 12 : రాబోయే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.20 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. బుదవారం నిర్మల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం 4 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.2 వేల కోట్లు కేటాయించాలన్నారు. బీసీ విద్యార్థుల విదేశీ విద్యకు రూ.60 నుంచి 300 కోట్లతో పాటు బీసీ హాస్టల్స్, గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలన్నారు.

బోథ్: పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

ఇచ్చోడ: సిరికొండ పోలీస్ స్టేషన్‌లో ..

బజార్‌హత్నూర్: మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు

భీంపూర్: అంతర్గాంలో కపిల్ ఇంటి వద్ద పోలీసు

# పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

- అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తుండగా అడ్డగింత

బోథ్, మార్చి 12 : అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన ఆదిలాబాద్ బోథ్, సొనాల మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆదేశాల మేరకు ఆయా మండలాల నాయకులు అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్‌కు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ డీ నారాయణ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రుక్మాణ్‌సింగ్, బోథ్ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, సొనాల బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మునేశ్వర్ సోమన్న ఉన్నారు.

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 12: సిరికొండ మండలంలోని సుంకిడి, సోంపెల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ ముట్టడికి హైదరాబాద్‌కు తరలి వెళ్తుండగా ఎస్ఐ శివరాం అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో సోంపెల్లి మాజీ సర్పంచ్ కందం సూర్యంకాంత్, బీఆర్ఎస్ నాయకులు రోహిదాస్, స్వామి, జాకు ఉన్నారు.

### అక్రమ అరెస్టులకు భయపడం

గుడిహత్నూర్, మార్చి 12 : అక్రమ అరెస్టులతో బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తే భయపడేది లేదని సర్పంచ్‌ల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు తిరుమల్‌గౌడ్ అన్నారు. అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన ఆయనను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి బయలు దేరుతున్న గుడిహత్నూర్ మండల బీఆర్ఎస్ నాయకులను ఎస్ఐ మహేందర్ అరెస్టు చేశారు.

భీంపూర్, మార్చి 12 : అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన అంతర్గాంలో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు బక్కి కపిల్ యాదవ్‌ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదన్నారు. అలాగే పలువురు నాయకులను అరెస్ట్ చేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

### అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

బజార్‌హత్నూర్, మార్చి 12 : అసెంబ్లీ ముట్టడికి మండలంలో నుంచి బయలుదేరిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో విఫలమైందని ప్రజలను మోసం చేసిందని అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన సర్పంచ్‌ల సంఘం మాజీ మండలాధ్యక్షుడు జ్ఞానేశ్వర్, బజార్‌హత్నూర్ మాజీ సర్పంచ్ సాయన్న, చందునాయక్‌తండా మాజీ సర్పంచ్ కవీందర్‌ను పోలీసులు అక్రమ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అక్రమ అరెస్టులు తప్ప ప్రజల కోసం అభివృద్ధి చేయడం చేతకాదని విమర్శించారు.

ఇంద్రవెల్లి, మార్చి 12: అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటారని భయంతో ప్రజా పరిపాలన చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని మాజీ సర్పంచ్‌లు కుడే కైలాస్, జాద్ లఖన్ సింగ్, ఏర్మ జాకేశ్వర్ అన్నారు. బుధవారం ఇంద్రవెల్లి మండలంలోని హర్కాపూర్ మాజీ సర్పంచ్ కుడే కైలాస్, ఏమాయికుంట మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్‌సింగ్, ధనోరా(బీ) మాజీ సర్పంచ్ ఏర్మ జాకేశ్వర్‌ను పోలీసులు ముందుస్తుగా అరెస్టు చేశారు. అనంతరం వీరిని సొంత పూచికతపై పోలీసులు విడుదల చేశారు.

### మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

సోన్, మార్చి 12: నిర్మల్ జిల్లా సోన్‌లోని మాజీ సర్పంచ్‌లను బుధవారం ఉదయం పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించి అరెస్టు చేశారు. అసెంబ్లీ నేపథ్యంలో ముందస్తుగా సర్పంచ్‌ల సంఘ మాజీ జిల్లా అధ్యక్షుడు తిరుక్కోవెల వినోద్‌కుమార్, శాకెర మాజీ సర్పంచ్ సుంచు శ్రీనివాస్‌ను ఉదయమే పోలీసులు ఇంటికి చేరుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇంద్రవెల్లి: పోలీస్ స్టేషన్‌లో అరెస్టు అయిన బీఆర్ఎస్ నాయకులు

సోన్: మాజీ సర్పంచ్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు

## సిరిచెల్మలో యథేచ్ఛగా వనమేధం

అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు నరికిన టేకు చెట్లు

ఇచ్చోడ, మార్చి 12 : బీఆర్ఎస్ ప్రభుత్వం అడవులను పెంచాలనే ఉద్దేశంతో హరితహారం పథకాన్ని ప్రవేశపెట్టి మొక్కలు నాటింది. నిధులు కేటాయించి వాటిని సంరక్షించింది. చెట్లు స్మగ్లింగ్‌కు గురి కాకుండా పది సంవత్సరాలు గట్టి బందోబస్తు నిర్వహించింది. కానీ ఇప్పుడు ఇచ్చోడ మండలంలో సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని ఫకీర్‌పేట్ బీట్ పరిధిలో సుమారు 40 వరకు చెట్లను స్మగ్లర్లు నరికి వేశారు. అటవీ శాఖాధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంతోనే విలువైన టేకు కలపను నరికి స్మగ్లర్లు తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై సిరిచెల్మ టైగర్ జోన్ ఎఫ్ఆర్వో నాగస్వామిని వివరణ కోరగా సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్‌లోని అటవీ ప్రాంతంలో నరికిన టేకు చెట్లను గుర్తించడం జరిగిందని, స్మగ్లర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహించినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నరికి వేసిన చెట్ల నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు.

## ఉచిత గర్భ కోశ నివారణ శిబిరం

మందులు అందజేస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి శాఖ అధికారి డాక్టర్ రాథోడ్ రామారావ్

ఇచ్చోడ, మార్చి 12 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని దాబా(బీ) గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి శాఖ వారి సహకారంతో మండల పశు వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం పశువులకు ఉచిత గర్భ కోశ నివారణ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశుగణాభివృద్ధి శాఖ అధికారి డాక్టర్ రాథోడ్ రామారావ్ హాజరై పశువులకు చికిత్స చేశారు. పశు పోషకులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ గోవింద్ నాయక్, గోపాలమిత్రలు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, పాడి రైతులు యోగేశ్, రాజు సింధే, బాలాజీ, మధు, శ్రీహరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్షలు


రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎదులాపురం, మార్చి 12: ఉద్యోగ నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి దానిని విస్మరించారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం వచ్చేంత వరకు ఉద్యోగ ఫలితాలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాదిగ మాట్లాడుతూ మాదిగలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ఆరోపించారు. అన్ని రకాల ఫలితాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇండ్ల ఎల్లన్న, వినయ్ సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్, టౌన్ ప్రెసిడెంట్ మడిపల్లి మనోజ్, రూరల్ మండలాధ్యక్షుడు తరుడి శంకర్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రీకాంత్, సూర్యప్రసాద్, దేవీదాస్, అంజన్న, గంగయ్య, మహిళలు పాల్గొన్నారు.

## లక్ష్మణచాందలో తెగని కుల బహిష్కరణ పంచాయితీ

లక్ష్మణచాంద, మార్చి 12:నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో కుల బహిష్కరణ పంచాయితీ జిల్లా పంచాయితీ అధికారి వచ్చిన తీర్చలేకపోయారు. తమను బహిష్కరించారని తమకు న్యాయం చేయాలని గత కొద్ది రోజులుగా జిల్లా స్థాయిలో కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. దాంతో కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలమేరకు బుధవారం జిల్లా పంచాయితీ అధికారి శ్రీనివాస్ ఇరువర్గాలకు నచ్చజెప్పారు. ఆయనతో పాటు సీఐ నవీన్ కుమార్, తహసీల్దార్ జానకి ఇరువర్గాలను ఒప్పించారు. కాని అధికారులు వెళ్లగానే ఇరువర్గాలు తిరిగి ఘర్షణ పడి ఎవరిదారి వారిదే అని నిర్ణయించుకున్నారు. దాంతో అధికారుల శ్రమ అంతా వృథాగా మారింది.

## పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సోన్, మార్చి 12: పోస్టల్ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఐపీబీసీ కల్యాణ్, ఎండీ షహనాజ్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా సోన్‌లో పోస్టల్ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వేను విజయవంతం చేయండి

ఎదులాపురం, మార్చి 13 : ఆదిలాబాద్ జిల్లాలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న సర్వేను వైద్య సిబ్బంది విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ రాథోడ్ నరేందర్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్‌లోని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎల్‌సీడీసీపై జిల్లాస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆశ కార్యకర్తలు ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం తమకు కేటాయించిన ఇండ్లను సందర్శించి కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించనున్నట్లు తెలిపారు. శరీరంపై పాలిపోయిన రాగి రంగు గల మొద్దుబారిన మచ్చలు, కాళ్లు చేతుల్లో తిమ్మిర్లు రావడం తదితర లక్షణాలు ఉన్నవారు తమ ఇంటికి వచ్చే ఆశ కార్యకర్తలకు చూపించుకోవాలని కోరారు. ఆశ కార్యకర్తలు సైతం ప్రతి ఇంటిలోని కుటుంబ సభ్యులను తప్పనిసరిగా పరీక్షించాలని సూచించారు. సంబంధిత సూపర్‌వైజర్లు, వైద్యాధికారులు సర్వేను పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానన్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ సుమలత, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం శ్రీధర్, డీపీఎంవోలు రమేశ్, వామన్ రావ్, ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు, లెప్రసీ నోడల్ పర్సన్స్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

# దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 12 : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం నిర్మల్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో సమగ్రశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ ద్వారా వారికి స్వయం సమృద్ధి కల్పించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వీటి ద్వారా దివ్యాంగులు తమ దైనందిన జీవితాన్ని సులభతరం చేసుకోవచ్చన్నారు. భవిత సెంటర్ ద్వారా దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆలింకో సంస్థ సహకారంతో జిల్లాలో అర్హులుగా గుర్తించిన 91 మంది దివ్యాంగులకు సుమారు 7 లక్షల 70 వేల రూపాయల విలువగల 133 ఉపకరణాలు, వీల్‌చైర్లు, శ్రవణ, దృశ్య పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, ఎంఈవో నాగేశ్వర్‌రావు, విద్యాశాఖ అధికారులు లింబాద్రి, ప్రవీణ్, దివ్యాంగులు, పోషకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భార్యను చంపిన భర్త

నార్నూర్, మార్చి 12 : కుటుంబ విషయంలో గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన భర్త కొట్టిన దెబ్బలతో భార్య మృతి చెందిన ఘటన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో చోటు చేసుకుంది. నార్నూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రహీంపాషా తెలిపిన వివరాల ప్రకారం..వాగ్మారే సులోచన, బాలాజీకి 25ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు అమ్మాయిలు, ముగ్గురు కొడుకులు ఉన్నారు. రెండేళ్ల క్రితం పెద్ద అమ్మాయికి పెళ్లికాగా తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. అమ్మాయి అక్రమ సంబంధం కొనసాగిస్తుందని వాగ్మారే బాలాజీకి అనుమానం వచ్చింది. అమ్మాయి ప్రవర్తన మార్చాలంటూ సులోచనను హెచ్చరించారు. ఇట్టి విషయంలో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. కోపంతో భార్యను కొట్టాడు. దీంతో స్పృహ కోల్పోవడంతో చికిత్స నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరిలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి అన్న శ్రావణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## బావిలో పడి ఎద్దు మృతి

నార్నూర్, మార్చి 12 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని చోర్‌గావ్ గోండుగూడలో బుధవారం బావిలో పడి ఎద్దు మృతి చెందింది. బాధితురాలు ఆత్రం అసూయబాయి తెలిపిన వివరాల ప్రకారం.. రెండు ఎద్దులు ఎదురు ఎదురుగా ఢీ కొట్టాయి. ప్రమాదవశాత్తు ఎద్దు బావిలో జారి పడి మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40వేలు ఉంటుంది. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని మహిళ రైతు కోరారు.

## లారీలు ఆపిన పలువురిపై కేసు

జైనథ్, మార్చి 12 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని భోరజ్ చెక్‌పోస్ట్ వద్ద రాత్రి 1 గంట సమయంలో హైవే మీద లారీలు ఆపిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. లారీలు ఆపుతున్న సమాచారం రాగానే అక్కడికి వెళ్లి చూడగా పద్మవార్ రాకేశ్, కోలిపుర సచిన్, తిప్పెల్లి కార్తీక్, సాత్విక్ తిరుపల్లి, మరి కొంతమంది భోరజ్ చెక్ పోస్ట్ వద్ద ఎటువంటి అధికారం లేకుండా మహారాష్ట్ర నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఎద్దుల లారీలను అక్రమంగా అడ్డుకొని, లారీ డ్రైవర్లు సందీప్ గోకులే, షేక్ సాహిల్‌ను బెదిరించారు. లారీలో ఎద్లు కావు ఆవులు ఉన్నాయని ఎక్కిచూస్తూ లారీ డ్రైవర్లను కొట్టడానికి వెళ్తు భయాభ్రాంతులకు గురి చేశారు. వారిపై జైనథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎలాంటి వాహనాలను గాని ప్రజలకు గాని ఇబ్బంది కలిగించొద్దని, ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే జైనథ్ ఎస్ఐ 8712659929, జైనథ్ సీఐ 8712659916 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

## గంజాయి నిందితుడి అరెస్ట్


మాట్లాడుతున్న రూరల్ సీఐ ఫణిదర్

ఎదులాపురం, మార్చి 12: గంజాయి నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనం, 176 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ ఫణిదర్ తెలిపారు. బుధవారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ గౌతమ్ పవార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. మావల పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాలు తనిఖీలు చేస్తున్న సమయంలో ఆదిలాబాద్‌లోని పిట్టల వాడకు చెందిన కటరే వెంకట్ ద్విచక్ర వాహనంలో 176 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నాము. అతడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

## ఆరోగ్య ఉప కేంద్రం తనిఖీ

రికార్డులు పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ నర్సు దుర్గా భవాని

నర్సాపూర్ (జీ), మార్చి 12 : నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లోని ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం పబ్లిక్ హెల్త్ నర్సు దుర్గా భవాని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో గర్భిణులు, బాలింతలు, కౌమర బాలికలకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. పొరపాట్లు జరగకుండా సేవలు చేయాలని, హాజరుపై నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ఆమె వెంట ఆశకార్యకర్తలు శకుంతల, లక్ష్మి ఉన్నారు.

## వీఆర్ఏల ముందస్తు అరెస్ట్

బోథ్ పోలీస్ స్టేషన్‌లో వీఆర్ఏలు

బోథ్, మార్చి 12: అసెంబ్లీ సమావేశాలు ముట్టడించేందుకు వెళ్తున్నారని సమాచారం మేరకు బుధవారం వివిధ గ్రామాలకు చెందిన వీఆర్ఏలను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. వీఆర్ఏలు ఎస్ నరేశ్, ఎం భీముడు, కే విజయ్‌కుమార్ పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఉన్నారు.

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి

భైంసా, మార్చి 12 : బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ జానకీషర్మిల అధికారులకు ఆదేశించారు. బుధవారం నిర్మల్ జిల్లా భైంసాలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని సూచించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఏఎస్పీ అవినాశ్ కుమార్, రూరల్ సీఐ నైలు, ఎస్ఐ అశోక్, క్యాంపు ఇన్‌చార్జి రఘువీర్, తదితరులు పాల్గొన్నారు.

## వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

ముథోల్, మార్చి 12 : వందశాతం ఇంటి పన్ను వసూలు చేయాలని డీపీవో సుదర్శన్ పాటిల్ అన్నారు. ముథోల్‌లో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యంతో పాటు ఇంటింటికీ వెళ్లి పన్నులు వసూలు చేయాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శివకుమార్, ఏపీవో శిరీష ఉన్నారు.

## సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలి

ఖానాపూర్ రూరల్, మార్చి 12: గ్రామాల్లో గ్రామస్తులు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలని ఎంపీవో రత్నకర్ రావు పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి కల్పనతో ఇంటి పన్నుల వసూలు చేయించారు. పంచాయతీ అభివృద్ధి చెందాలంటే అందరూ ఇంటి పన్నులు చెల్లించాలని సూచించారు.

## నేడు ఖానాపూర్‌లో హోలీ వేడుకలు

ఖానాపూర్, మార్చి 12: గత కొన్ని ఏండ్ల నుంచి సనాతనంగా ఆచారిస్తున్న ధర్మం ప్రకారం ఖానాపూర్‌లో బుధవారం రాత్రి కామదహనం నిర్వహించగా గురువారం హోలీ పండుగ జరుపుకోవాలని ఖానాపూర్ హిందూ ఉత్సవ సమితి, పట్టణ ప్రముఖులు, నాయకులు పిలుపునిచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలు శాంతియుతంగా హోలీ పండుగ జరుపుకోవాలని సూచించారు. ఇక్కడ హిందూ ఉత్సవ సమితి నాయకులు శెట్టి శ్యాం, మోహన్‌రావ్, తదితరులు ఉన్నారు.

## ఎల్ఆర్ఎస్‌పై రాయితీ సద్వినియోగం చేసుకోవాలి

భైంసా, మార్చి 12 : ఎల్ఆర్ఎస్‌పై 25 శాతం రాయితీ అవకాశాన్ని దరఖాస్తుదారులు, రియల్టర్లు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బీ రాజేశ్‌కుమార్ సూచించారు. బుధవారం భైంసాలోని తన కార్యాలయంలో దరఖాస్తులదారులు, రియల్టర్లకు ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం రూ. వెయ్యి రుసుముతో దరఖాస్తు చేసుకున్న వారు ఫీజులో 25 శాతం రాయితీ చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఈ అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు. పట్టణంలో ఎల్ఆర్ఎస్ కోసం 6288 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఎల్ఆర్ఎస్ రూపంలో రూ. 2 కోట్ల వరకు ఆదాయం సమకూరాల్సి ఉందని కమిషనర్ వెల్లడించారు. బుధవారం 30 మంది ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించగా రూ. 2.66 లక్షలు ఫీజు రూపంలో వచ్చినట్లు చెప్పారు.